క్లుప్తంగా

మొక్కలను సంరక్షించాలి



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

శిరివెళ్ల: జగనన్న పచ్చతోరణం కింద నాటిన మొక్కలను సంరక్షించుకోవాలని ఉపాధి హామీ పథకం పీడీ రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీపై బహిరంగ చర్చ జరిగింది. మండలంలోని పంచాయతీల వారిగా సామాజిక తనిఖీ నివేదికలను డీఆర్పీలు చదివి వినిపించారు. 2021- 22లో రూ.7.54 కోట్ల పనులు జరిగాయి. అందులో రూ.1.54 లక్షలు రికవరీ చేయాలని పీడీ ఆదేశించారు. రికవరీలో పంచాయతీ రాజ్ శాఖలో చేపట్టిన పనులకు కేటాయించిన రూ.1.50 లక్షల విలువైన సిమెంట్ బస్తాలను ఇతర పనులకు వాడుకున్నట్లు తనిఖీ బృందం తేల్చింది. అలాగే ఉపాధి మేటీలు రూ.4 వేలు దుర్వినియోగం చేసినట్లు బృందం నిర్ధారించిందని వాటిని కూడా రికవరీ చేయాలని సూచించారు. అలాగే సామాజిక పింఛన్లపై కూడ తనిఖీ జరిగింది. 8,014 పింఛన్ల పంపిణీ సక్రమంగా జరుగుతోందని స్పష్టం చేశారు. అడిషనల్ పీడీ సలీంబాషా, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఏపీఓ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి

ఆళ్లగడ్డ: ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయి సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని డ్వామా పీడీ రామచంద్రారెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో బుధవారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఈజీఎస్, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీ, ఎస్ఎస్ఏ శాఖల వారీగా ఖర్చు చేసిన నిధులు, పనులపై బహిరంగా విచారణ చేపట్టారు.

సమస్యలు పరిష్కరించండి

రుద్రవరం: గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గిరిజనులు ఎంపీడీఓ మధుసూదనరెడ్డిని కోరారు. హరినగరం చెంచు గూడెంలోని ప్రభుత్వ పాఠశాలలో సాగుతున్న బడి నాడు- నేడు పనులు, మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఎంపీడీఓ పరిశీలించారు. అనంతరం ఆయన గూడెం వాసులతో సమావేశం కాగా వారు పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. కార్యదర్శులు ఆదిలక్ష్మి, శివకృష్ణ ,వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగముని ఉన్నారు.

ముగిసిన సప్తాహం

నంద్యాల(వ్యవసాయం): భారతీయ జీవన సరళిని శాసిస్తున్న గ్రంధం శ్రీమద్రామాయణం అని ప్రముఖ వ్యాఖ్యాత ధార్మిక ప్రవచకుడు డాక్టర్ దివి హయగ్రీవాచార్యులు అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఎస్బీఐ కాలనీలోని రామాలయంలో వారం రోజులగా జరుగుతున్న శ్రీమద్రామాయణ సప్తాహం బుధవారంతో ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హిందూ ధర్మప్రచార ఉమ్మడి కర్నూలు శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి హాజరయ్యారు.

రైతు బిడ్డకు బంగారు పతకం



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న శ్రీవాణి

నంద్యాల(రూరల్): మండలంలోని పాండురంగాపురం గ్రామంలోని రైతు కుటుంబం పోతిరెడ్డి, వరలక్ష్మి చిన్న కూతురు శ్రీవాణి మెడిసిన్‌లో బంగారు పతకం సాధించారు. ఆమె బుధవారం మాట్లాడుతూ హైదరాబాద్‌లోని ఉస్మానియా మెడికల్ కళాశాలలో మంగళవారం జరిగిన స్నాతకోత్సవంలో హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్.కాళోజి నారాయణరావు తనకు ఎండీ పీడియాట్రిషీయన్‌లో గోల్డ్ మెడల్ అందజేశారని చెప్పారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): వైఎస్సార్ ఆసరా మూడో విడత నిధుల విడదలపై హర్షం వ్యక్తం చేస్తూ 26వ వార్డు కౌన్సిలర్ మేస చంద్రశేఖర్, కో ఆప్షన్ మెంబర్ శోభారాణి ఆధ్వర్యంలో పొదుపు మహిళలు దేవనగర్‌లో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం చేశారు. 27వ వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ దేవనగర్‌బాషా, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

బియ్యపు గింజలతో రాముని చిత్రం



నంద్యాల(అర్బన్): శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ బియ్యపు గింజలతో రాముని చిత్రాన్ని వినూత్న రీతిలో తీర్చిదిద్దారు. 14అంగుళాల పొడవు, 10.5 అంగుళాల వెడల్పు డ్రాయింగ్ చార్ట్‌పై 3,120 బియ్యపు గింజలతో రాముడి చిత్రం వేశారు. ప్రతి బియ్యపు గింజపై మైక్రోబ్రష్‌తో రామనామాలు వేశారు.

మ్యాప్ పాయింటింగ్‌లో అవగాహన పెంచుకోవాలి



మ్యాప్ పాయింటింగ్‌లో ఇండియా, వరల్డ్ మ్యాపులసాధనతో మంచి మార్కులు సాధించవచ్చు. ఒక నిర్దిష్ట అంశాన్ని చదివి సొంత పరిజ్ఞానంతో రాసే నైపుణ్యం పెంచుకోవాలి. జాగ్రఫీ, ఎకనామిక్స్‌లో భారతదేశం భౌగోళిక స్వరూపం, శీతోష్ణ స్థితి, భారతదేశ నీటి వనరులు, వలసలు, ఆహార భద్రత, ఉత్పత్తి, ఆదాయం, సుస్థిరాభివద్ధి పాఠ్యాంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. హిస్టరీలో రెండవ ప్రపంచ యుద్ధ కాల సమయంలో ప్రపంచం సమకాలీన సామాజిక ఉద్యమాలపై దృష్టి పెట్టాలి. భారత జాతీయోద్యమ చరిత్రను ప్రత్యేక దష్టితో చదవాలి. సివిక్స్‌లో రాజ్యాంగం మూల సూత్రాలు, రాజ్యాంగంలో పేర్కొన్న అంశాలను ఏఏ దేశాల రాజ్యాంగాల నుంచి అనుసరించారు తదితర కోణాల్లో చదవాలి.

– ఎల్.సుబ్బయ్య, ఎస్ఏ–సోషల్, జెడ్పీహెచ్ఎస్, దీబగుంట్ల

విశ్లేషణ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



(నేచురల్ సైన్సెస్)సైన్స్ పేపర్‌లోనే పార్ట్–బిగా ఉండే జీవశాస్త్రంలో రాణించేందుకు అవగాహన, స్వీయ విశ్లేషణ నైపుణ్యాలను పెంచుకోవాలి. పుస్తకాల్లోని ఆయా అంశాలకు సంబంధించి ఫ్లో చార్ట్‌లు, బ్లాక్ డయాగ్రమ్స్‌లను సొంతంగా రూపొందించుకోవాలి. విశ్లేషణాత్మక, తులనాత్మక అధ్యయనానికి ప్రాధాన్యం ఇవ్వాలి. నేర్చుకున్న అంశాలను వాస్తవ పరిస్థితులతో అన్వయించే విధంగా చదివితే వంద శాతం మార్కులు సాధించవచ్చు. ప్రయోగాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ప్రయోగ నిర్వహణ ప్రక్రియపై అవగాహన, ప్రతి చాప్టర్‌లో పేర్కొన్న అభ్యాసాలకు సంబంధించి విశ్లేషణ, కారణాలు, పోలికలు, బేధాలు తెలుసుకుంటూ చదవాలి. డయాగ్రమ్స్ విషయంలో భాగాలను గుర్తించడమే కాకుండా వాటి ప్రాముఖ్యతను వర్ణించగలిగేలా ప్రాక్టీస్ చేయాలి.

– కే.వీ. సుబ్బారెడ్డి, జీవశాస్త్ర ఉపాధ్యాయులు

సంఘటనలతో అన్వయించుకోవాలి



సైన్స్‌సబ్జెక్ట్‌లో పార్ట్–ఎ ఫిజికల్ సైన్స్(పీఎస్)లో మంచి మార్కులు సాధించాలంటే అప్లికేషన్ అప్రోచ్‌తో చదవడం ఎంతో ముఖ్యం. ఆయా చాప్టర్లకు సంబంధించిన అంశాలను నిజజీవిత సంఘటనలతో అన్వయించుకుంటూ ప్రిపరేషన్ సాగిస్తే పూర్తి మార్కులు సాధించొచ్చు. విషయ పరిజ్ఞానం, విషయ అవగాహనతో పాటు, ప్రశ్నించడం, పరికల్పన చేయడం, ప్రయోగాలు, క్షేత్ర పర్యటనలు, సమాచార నైపుణ్యాలు, ప్రాజెక్ట్ పనులు, పటాలు వాటి ద్వారా భావ ప్రసారం వంటి వాటిపైన కృషి చేయాలి. కాంతి పరావర్తనం, కాంతి వక్రీభవనం, విద్యుత్ ప్రవాహం, రసాయన బంధం, ఇంద్రధనుస్సు ఏర్పడే విధానం, పరమాణు నిర్మాణం, కర్బన సమ్మేళనాలపై పట్టు సాధించాలి. మూలకాల ధర్మాలు, వర్గీకరణ, రసాయన సమీకరణాలను బాగా ప్రాక్టీస్ చేయాలి. ఇలా చేయడం వల్ల లఘు, అతి స్వల్ప, బహుళైచ్ఛిక ప్రశ్నలకు సులువుగా సమాధానాలు రాయవచ్చు. – నరసింహయ్య, ఫిజిక్స్ సబ్జెక్ట్ నిపుణులు, గోవిందపల్లె

ఉత్తమ మార్కులు సాధిద్దామిలా

- అభ్యసన, పునశ్చరణ, అమలు పరచడం కీలకం
- మానసిక ఒత్తిడిని అధిగమిస్తేనే విజయం
- మంచి స్కోర్ సాధించేందుకు సబ్జెక్ట్ నిపుణుల సూచనలు
- 3నుంచి 'పది' పరీక్షలు

విద్యార్థి దశలో అత్యంత కీలకమైన దశ.. మొదటి మెట్టు పదో తరగతి. మరో మూడు రోజుల్లో పది పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ ఏడాది ప్రశ్న పత్రం, పరీక్షల విధానాన్ని ప్రభుత్వం మార్చిన విషయం తెలిసిందే. గ్రేడింగ్ విధానాన్ని తొలగించి మార్కుల పద్ధతిని అమలు చేస్తోంది. పరీక్షల్లో మెరుగైన ఫలితం సాధించాలన్నా, ఉత్తమ మార్కులు పొందాలంటే సన్నద్ధత, పునశ్చరణ, చివరగా అమలు చేయడం. అంటే పరీక్షలో ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతం జవాబులు రాయాలి. వివిధ అంశాలపై ఆయా సబ్జెక్టుల వారీగా పలువురు నిపుణుల సూచనలు.. – నంద్యాల(సిటీ)

'పదో తరగతిలో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలంటే ఏ పార్ట్‌లో ఉన్న ప్రశ్నలను అదే పార్ట్‌లో రాస్తే మంచిది. చదివే ప్రతి అంశాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకుంటూ ఆయా సబ్జెక్ట్ అంశాలపై పట్టు సాధించాలి' అంటున్నారు సబ్జెక్ట్ నిపుణులు.



చాపిరేవులలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

చదవడంతో పాటు ప్రాక్టీస్ చేయాలి



ఇంగ్లిష్ పేపర్‌లో మంచి మార్కులు పొందేందుకు వెర్బల్, నాన్–వెర్బల్ అంశాలు బాగా చదవాలి. ఉదాహరణకు టేబుల్స్, బార్ డయాగ్రమ్స్, పై చార్ట్స్ తదితర అంశాలను అధ్యయనం చేయాలి. సొంతంగా విశ్లేషించేలా నైపుణ్యం పెంచుకోవాలి. ఇందుకోసం పాత ప్రశ్న పత్రాల సమాధానాలను పరిశీలించడం కూడా మేలు చేస్తుంది. ప్రతి పాఠం చివరలో ఉండే కాంప్రహెన్సివ్ ప్రశ్నలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ప్రతి పాఠానికి సంబంధించి సారాంశాన్ని గ్రహించి సొంతగా రాసుకునే అలవాటు చేసుకోవాలి. పోయెట్రీ ప్రశ్నల్లో మంచి మార్కుల సాధన కోసం సదరు పద్యంలో ముఖ్య పదాలు, యాంటోనిమ్స్, సినానిమ్స్‌పై దష్టి సారించాలి. వీటితోపాటు పార్ట్స్ ఆఫ్ స్పీచ్, డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ స్పీచ్, యాక్టివ్ వాయిస్, ప్యాసివ్ వాయిస్, ఫ్రేజల్ వెర్బ్స్. ఈ విషయంలో చదవడంతోపాటు ప్రాక్టీస్ కూడా చేస్తే మెరుగైన మార్కులు పొందేందుకు మరింత ఆస్కారం లభిస్తుంది. అలాగే అపరిచిత గద్యం (అన్ నోన్ ప్యాసేజెస్) సారాంశాన్ని గ్రహించేలా చదవాలి. లెటర్ రైటింగ్‌కు సంబంధించి పంక్చువేషన్, బాడీ ఆఫ్ ది లెటర్ వంటి అంశాలపై పట్టు అవసరం.

– కట్టు.ప్రమీలదేవి, ఎస్ఏ–ఇంగ్లిష్, చాపిరేవుల ఉన్నత పాఠశాల

విశ్లేషణాత్మకంగా చదవాలి



సిలబస్ అంశాలను పూర్తిగా అధ్యయనం చేస్తూ ప్రాక్టీస్ చేయడం ద్వారా ఈ సబ్జెక్ట్‌పై సులభంగా పట్టు సాధించొచ్చు. మొత్తం 14 అధ్యాయాలను విశ్లేషణాత్మకంగా చదివితే మంచి మార్కులు సాధించవచ్చు. సమస్య సాధనకు 40 మార్కులు, సమస్యకు గల కారణాలు వాటి నిరూపణ చేయడం కోసం 20 మార్కులు కేటాయిస్తారు, సమాధానం తెలియజేసే భావ వ్యక్తీకరణకు 10 మార్కులు, అనుసంధానానికి 15 మార్కులు, ప్రాతినిధ్యపరచుటకు 15 మార్కులు కేటాయించనున్నారు. విద్యార్థులు ఈ విధానాన్ని పాటిస్తే అధిక మార్కులు సాధించొచ్చు. సంఖ్యా వ్యవస్థ, బీజగణితం, నిరూపక రేఖాగణితం, రేఖాగణితం, క్షేత్రమితి, త్రికోణమితి, సంభావ్యత, సాంఖ్యకశాస్త్రంపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలి. ముఖ్యమైన నిర్వచనాలు, సూత్రాలను నోట్స్ రూపంలో రాసుకుంటే రివిజన్‌లో ఉపయుక్తంగా ఉంటుంది. పాఠ్యపుస్తకంలో ప్రతి చాప్టర్ చివరన ఇచ్చే సమస్యలను తప్పకుండా ప్రాక్టీస్ చేయాలి. గ్రాఫ్‌లు, నిర్మాణాత్మక సమస్యలకు సమాధానాలు కనుగొనేందుకు ప్రాక్టీస్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. వాస్తవ సంఖ్యలు, సమితులు, బహుపదులు, రెండు చరరాశులలోని రేఖీయ సమీకరణాల జత అధ్యాయాలలోని గ్రాఫ్ ఆధారిత సమస్యలు, సంభావ్యత, సాంఖ్యక శాస్త్రం, త్రికోణమితి, క్షేత్రమితిలోని ముఖ్యమైన సమస్యలను సాధన చేయాలి. ఏపార్ట్‌లో ఉన్న ప్రశ్నలకు ఆ పార్ట్‌లోనే సమాధానాలు రాయాలి. –ఎస్. రాజశేఖర్‌రెడ్డి, మిడుతూరు జెడ్పీ ఉన్నత పాఠశాల మ్యాథమెటిక్స్.

వ్యాకరణాంశాలు ఒకే చోట రాయాలి



ప్రశ్న పత్రంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి, దీని వల్ల పరీక్ష గదిలో సమయం ఆదా అవుతుంది. 1నుంచి 12 వరకు వ్యాకరణాంశాలు ఒకే చోట సమాధానాలు రాయాలి. 13వ ప్రశ్నకు సమాధానం పేరాగ్రాఫ్‌లో ఉంటుంది కావున పేరాను క్షుణ్ణంగా చదివి రాయాలి. పద్యభాగం నుంచి వచ్చే ప్రశ్నలపై క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి. కవి పరిచయం మీద రెండు ప్రశ్నలు అడుగుతారు. ఇందులో 12 మంది గురించి మాత్రమే ఉంది. కావున ఈ అంశం పై సీ,డీ గ్రేడ్ విద్యార్థులు దృష్టి సారించి సారాంశాలను రాస్తే సులువుగా మార్కులు పొందవచ్చు. అలాగే.. సమయ పాలన ముఖ్య... మొదటి భాగానికి 30 నిమిషాలు, రెండో భాగానికి 20 నిమిషాలు, నాలుగో భాగానికి 60 నిమిషాలు, చివరి భాగానికి 45 నిమిషాలు కేటాయిస్తే మిగిలిన సమయంలో సమాధానాలను మరోమారు సరిచూసుకోవచ్చు. –పీ.మధుసూదన్ కుమార్, హిందీ పండిట్, జెడ్పీహెచ్ఎస్,మద్దూరు

విద్యార్థులు ఒత్తిడికి గురికారాదు



పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులు ఒత్తిడికి లోనవరాదు. పరీక్షా సమయంలో విశ్రాంతి అవసరం, ఆరోగ్యాన్ని సురక్షితంగా చూసుకోవాలి. విద్యార్థుల తల్లితండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పరీక్ష కేంద్రానికి ముందుగా చేరుకుని విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకుని పరీక్షలు బాగా రాయాలి. ఉపాధ్యాయులు సూచనల ప్రకారం జాగ్రత్తగా రాస్తే అధిక మార్కులు సాధించడం సులువే.

-అనురాధ,డీఈఓ, నంద్యాల

పాఠం సారాంశం.. ఉద్దేశం తెలుసుకోవాలి



ఫస్ట్ లాంగ్వేజ్‌గా ఉండే తెలుగు పేపర్‌లో మంచి మార్కులు సాధించేందుకు విద్యార్థులు ముందుగా పద్య , గద్య భాగాల్లోని అంశాలను గుర్తుంచుకుని పునశ్చరణ చేస్తే మంచి మార్కులు సాధించవచ్చు. పాఠాన్ని చదవడమే కాకుండా సారాంశాన్ని, ఉద్దేశాన్ని తెలుసుకోవాలి. ప్యాసేజ్ పేరిట ఉండే అపరిచిత గద్యం విషయంలో సొంతగా ఆలోచిస్తూ చదవాలి. ఉపవాచకానికి సంబంధించి ఇతివృత్తం , ప్రాముఖ్యత, పాత్రలు, వాటి ప్రాధాన్యత, వ్యక్తుల ప్రవర్తన శైలి తదితర అంశాల ద్వారా ఇచ్చే సందేశాన్ని తెలుసుకుంటే మంచిది. వ్యాకరణంలో ప్రతిభ చూపాలంటే సంధులు, సమాసాలు, సంయుక్తార్థాలు, ఉత్పత్త్యర్థాలు, జాతీయాలు బాగా చదివి అర్థం చేసుకోవాలి. అలాగే రామాయణంలోని సంఘటన క్రమానికి సంబంధించి బాల, అయోధ్య కాండాలను బాగా చదవాలి. చివరగా..ప్రతి పాఠం వెనుక ఉన్న వ్యాకరణాంశాలను క్షుణ్ణంగా చదివి సాధన చేస్తే మంచి స్కోర్ సాధించవచ్చు. – మాబు బాషా, ఎస్ఏ–తెలుగు, జెడ్పీహెచ్ఎస్, బలపనూరు

న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేయాలి

నంద్యాల(వ్యవసాయం): న్యాయవాదుల సంక్షేమానికి, అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేయాలని నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ సభ్యులకు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో నూతన బార్ అసోసియేషన్ సభ్యులు అధ్యక్షుడు విజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని పదవులు ఏకగ్రీవం కావడం హర్షనీయమన్నారు. అధ్యక్షుడు విజయశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఏకగ్రీవంగా తనను ఎన్నుకోవడం సంతోషమనీ, తనకు ఇచ్చిన బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రఘుప్రకాష్, జనరల్ సెక్రటరీ ప్రతాప్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ మద్దిలేటి, ట్రెజరర్ సయ్యద్ నూర్ ఆలం ఖాద్రీ, లైబ్రేరియన్ బాబు రావు, స్పోర్ట్స్, కల్చరల్ రెప్రజెంటేటివ్ ప్రసాద్‌రెడ్డి, మహిళా ప్రతినిధి రాజేశ్వరి, నంద్యాల జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.




ఎమ్మెల్యేను సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

రాములోరి కల్యాణానికి సర్వం సిద్ధం

- శ్రీరామనవమికి చురుగ్గా ఏర్పాట్లు
- భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు

నంద్యాల(వ్యవసాయం): శ్రీరామనవమి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించేందుకు పట్టణంలోని పలు రామాలయాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ ఏడాది అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఆలయాలకు రంగులు వేయించి విద్యుద్దీపాలంకరణతో ముస్తాబు చేశారు. సీతారాముల కల్యాణం తిలకించేందుకు వచ్చే భక్తులకు పెసర పప్పు, బెల్లం పానకం, అన్న వితరణకు ఏర్పాట్లు, చలువ పందిళ్లు, పూలంగి సేవ కార్యక్రమం, పూలతో అలంకరించిన కల్యాణ వేదికలను సిద్ధం చేశారు. స్థానిక సంజీవనగర్ రామాలయంలో శ్రీభగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12గంటలకు అభిజిత్ లగ్నంలో స్వామి వారి దివ్య కల్యాణం కార్తికేయశర్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. అలాగే సీతాదేవికి ఒడిబియ్యం కార్యక్రమం, సాయంత్రం పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టనున్నారు. బైటిపేట ఆంజనేయస్వామి దేవస్థానంలో రాములవారి కల్యాణం అనంతరం అన్నదానం చేస్తామని ఈఓ ఆంజనేయశర్మ తెలిపారు. ఎస్‌బీఐ రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించడానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఎన్‌జీఓ కాలనీ, నందమూరినగర్, రైల్వే స్టేషన్ కోదండ రామాలయం, టెక్కె నాగులకట్ట దేవాలయం, సంగపేట, కోటవీధి రామాలయం, ఉప్పరిపేటలోని భక్తాంజనేయస్వామి దేవాలయాల్లో కల్యాణోత్సవం, అన్నదానం తదితర కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని నిర్వాహకులు తెలిపారు.



సంజీవనగర్ రామాలయంలో కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

ప్రజా సంక్షేమమే ధ్యేయం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ గంగుల, ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని మండలి విప్ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. అహోబిలం గ్రామంలో బుధవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని మోడల్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, జెడ్పీటీసీలు పున్యలక్ష్మీదేవి, శకుంతల, లక్ష్మిదేవి, మాధవి, ఉప మండలాధ్యక్షుడు నాసారి ప్రసాద్, సర్పంచ్ నాసారి ఈరమ్మ, కెడీసీ బ్యాంక్ డైరెక్టర్ నాసారి వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బయ్య ఉన్నారు.

అహోబిలంలో ప్రారంభించిన అభివృద్ధి పనులు

- రూ. 505 లక్షలు ఆర్అండ్‌బీ నిధులతో సీసీ రోడ్డు
- రూ.20 లక్షలతో ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు
- రూ.10 లక్షలతో సాదు కొట్టం కాలనీ సమీపంలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు
- రూ. 20 లక్షలతో కట్ట కింద నిర్మించిన సీసీ రోడ్డు
- రూ. 49 లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అదనపు గది నిర్మాణం
- ఇందిరమ్మ కాలనీకి చెందిన 260 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ

నంద్యాల అభివృద్ధే ధ్యేయం



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

నంద్యాల: నియోజకవర్గ అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ధ్యేయమని ఎమ్మెల్యే శిల్పారవి చంద్రకిశోర్ రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని 28వ వార్డులో రూ.21 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనేజీలు, పైప్‌లైను పనులను ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషాకు స్థానిక నాయకుల నుంచి ఘన స్వాగతం లభించింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ నంద్యాల పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటామన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, వైస్ చైర్మన్‌లు గంగిశెట్టి శ్రీధర్, జంగం పాంశావలి, దృశ్య కలల డైరెక్టర్ సునీత, మాజీ కౌన్సిలర్ అమృతరాజ్, రహంతుల్లా పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే లక్ష్యం



మహిళకు బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(రూరల్): పేదల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పాండురంగాపురం గ్రామంలో గ్రామ నాయకులతో కలిసి ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాలుగేళ్లలో అందిన సంక్షేమ పథకాల గురించి ఇంటింటికీ తిరిగి వివరించారు. అలాగే ఏవైనా సమస్యలుంటే చెప్పాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అవినీతి అవకాశం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారని, ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేర్చిన ముఖ్యమంత్రిగా జగనన్న ఖ్యాతి గాంచారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్‌యార్డు చైర్మెన్ పురుషోత్తమరెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, సర్పంచ్ డోలావతి, ఎంపీటీసీ బసవసుబ్బారెడ్డి, మండల కన్వీనర్ బసవేశ్వరరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

వేలాలు మళ్లీ వాయిదా

నంద్యాల(సిటీ): పట్టణంలో మున్సిపల్ పరిధిలోని మార్కెట్, సైకిల్ స్టాండ్, పశువుల సంత నిర్వహణకు 2023–24 సంవత్సరానికి బహిరంగ వేలాన్ని మున్సిపల్ రెవెన్యూ అధికారి వరప్రసాద్ మరోమారు వాయిదా వేశారు. బుధవారం స్థానిక కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో నిర్వహించిన వేలాల్లో పాటదారులు సరైన ధ్రువపత్రాలు సమర్పించలేదని ఏప్రిల్ 1వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. అయితే పశువుల సంతను మాత్రం రూ.81వేలకు దక్కించుకున్నారు.

గాలీ వాన బీభత్సం



ఉయ్యాలవాడ వద్ద మిరప దిగుబడులపై వర్షం కురుస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ : ఉరుములు, మెరుపులతో ఉన్నట్లుండి ఆకాశం మేఘావృతమై బుధవారం సాయంత్రం గాలీ వాన బీభత్సం సృష్టించింది. ఈ నెల 17న వడగళ్ల వాన కురవడంతో మిరప రైతులు అధిక శాతం నష్టపోయారు. గాలి వానతో దిగుబడులపై పట్టలు కప్పుకునేందుకు కూడా అవకాశం లేకపోవడంతో గాలికి కొట్టుకుపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

లక్ష్యాలను చేరుకోవాలి

శిరివెళ్ల: ఉపాధి లక్ష్యాలను చేరుకోవాలని ఉపాధి హామీ పథకం పీడీ రామచంద్రారెడ్డి సూచించారు. బుధవారం ఉపాధి పనుల పురోగతిపై స్థానిక సిబ్బందితో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ 2023–24 ఆరంభం నుంచే పనులు మొదలు పెట్టాలన్నారు.

సంక్షిప్తం

ప్రవచనాలకు ఆహ్వానం

నంద్యాల(వ్యవసాయం): ఏప్రిల్ 4వ తేదీన చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమానికి మన ఊరు–మన గుడి–మన బాధ్యత నిర్వాహకులు ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డికి బుధవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్వాహకులు రాంప్రసాద్, ఆంజనేయులు మాట్లాడుతూ ప్రథమ నందీశ్వర స్వామి దేవస్థానంలో చాగంటి కోటేశ్వరరావు గారి ప్రవచన కార్యక్రమానికి అవసరమైన సహాయ సహకారలు అందించాలని ఎమ్మెల్యేను కోరామన్నారు. అదేవిధంగా ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డు కోసం వేల మందితో ఓంకార నాథం చెప్పే కార్యక్రమం రికార్డు కాబోతుందన్నారు.

మేథాశక్తి పెంపొందేందుకే క్విజ్ పోటీలు

నంద్యాల(వ్యవసాయం): విద్యార్థులలో మేథాశక్తిని పెంపొందించేందుకు క్విజ్ పోటీలు ఎంతో దోహదం చేస్తాయని కేశవరెడ్డి విద్యాసంస్థల అధినేత కేశవరెడ్డి నాగిరెడ్డి అన్నారు. బుధవారం ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కేశవరెడ్డి విద్యాసంస్థల విద్యార్థులకు క్విజ్ క్వెస్ట్ పోటీను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులను కేవలం చదువులలోనే కాకుండా అన్ని రంగాలలోనూ తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందించారు.

వ్యక్తి ఆత్మహత్య

రుద్రవరం: మండలంలోని ఎల్లావత్తులకు చెందిన మహేష్ (35) బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. కొంతకాలంగా ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడేవాడు. వాటికి తోడు ఐదారు నెలల క్రితం ఆయన భార్య కూడా ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో మనోవేదనకు గురై అఘాయిత్యానికి పాల్పడ్డాడని తెలిపారు. ఈ వియంపై ఎస్ఐ నిరంజన్‌రెడ్డిని వివరణ కోరగా కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడతామన్నారు. మృతుడికి హిరణ్య,స్వప్న అనే ఇద్దరు కూమార్తెలు,ఈశ్వర్ అనే ఒక కుమారుడు ఉన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

ఉయ్యాలవాడ : ఉపాధి హామీ పథకం కింద కూలీల సంఖ్య పెంచేందుకు క్షేత్రస్థాయిలో సమష్టి బాధ్యతతో పనిచేయాలని ఆ శాఖ ఏపీఓ రవిప్రకాష్ సిబ్బందికి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి రోజు 2,800 మంది కూలీలు ఉపాధిలో పాల్గొనేలా లక్ష్యాన్ని నిర్దేశించారన్నారు. ప్రస్తుతం రోజుకు 1,200 మంది మాత్రమే పనుల్లో పాల్గొంటురన్నారు. సుద్దమల్ల, సర్వాయిపల్లె, రూపనగుడి, అల్లూరు, ఎస్.కొత్తపల్లె, పడిగెపాడు గ్రామాల్లో 20 శాతంలోపే కూలీలు హాజరవుతుండడం పై ఫీల్డ్ అసిస్టెంట్ల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.